


9న జిసిఎంఎస్ ఎన్నికలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 9న గిరిజన సహకార మార్కెటింగ్ సంఘం ఎన్నికలు జరుగనున్నాయని జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.బాబ్జీరావు వ్యవహరించనున్నారని చెప్పారు. సంఘానికి చెందిన మూడు డైరెక్టర్ పోస్టులకు చేతులెత్తే విధానం ద్వారా ఎన్నిక నిర్వహించనున్నట్లు చెప్పారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఎన్నిక వరకు మొత్తం ప్రక్రియ అదేరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జరుగుతుందని తెలిపారు. ఎన్నిక అనివార్యమైతే ఓటింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం ఐదు తర్వాత ఎన్నికల ఫలితం ప్రకటించనున్నట్లు డిఎం మహేంద్ర కుమార్ ఆ ప్రకటనలో తెలిపారు.

భూమి చుట్టూ తిరుగుతున్న సమస్యలు

- రెవెన్యూ చుట్టూ జనం ప్రదక్షిణలు
- గత టిడిపి ప్రభుత్వంలోనూ నిర్వహణ
- సమగ్ర సర్వేతో పెరిగిన భూవివాదాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

భూ విలువ ఊహించని రీతిలో పెరిగింది. అది ఉండే ప్రాంతాన్ని బట్టి దాని విలువ పెరుగుతూ వస్తోంది. మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ భూమికి గిరాకీ పెరిగింది. పదేళ్ల క్రితం ప్రతి ఒక్కరూ డబ్బును వివిధ రూపాల్లో దాచుకునే ప్రయత్నం చేసేవారు. కానీ ఇప్పుడు డబ్బున్న ప్రతి ఒక్కరూ భూమి పైనే పెట్టుబడి పెడుతున్నారు. భూమి ఒక లాభదాయకమైన వ్యాపార వస్తువుగా మారడంతో సమస్యలు కూడా అదే తరహాలో పెరుగుతూ వచ్చాయి. పట్టణాలు, నగరాలు, గ్రామాల్లోనూ భూ సమస్యలు ఇంతింతై అన్నట్టుగా పెరిగాయి. సమస్యలు పెరుగుతూ వస్తున్న రీతిలో పరిష్కారానికి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. భూమికి, రెవిన్యూ శాఖకు మధ్య సంబంధం విడదీయరానిది. భూమికి డిమాండ్ పెరిగిన నేపథ్యంలో వివాదాలు పెరగడం, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోకపోవడంతో అవి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విధానాలు మారడంతో భూమికి సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఫలితంగా భూ సమస్యలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నాయి. భూముల్లో ఉన్న రకరకాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, రెవెన్యూ అధికారులు, సిబ్బందికీ పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో సమస్యలు సమస్యలు గానే మిగులుతున్నాయి. ఫలితంగా రెవెన్యూ అధికారుల చుట్టూ జనం తిరగాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. వారం వారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్ సెల్ లోనూ భూసమస్యలే అధికంగా దరఖాస్తుల రూపంలో అందుతున్నాయి. సమస్యలు పెరుగుతున్నంత వేగంగా పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం, తగినంత సిబ్బంది లేకపోవడం, రెవెన్యూ రికార్డులు కూడా అందుబాటులో లేకపోవడంతో సంతృప్తి కరమైన స్థాయిలో రెవెన్యూ సేవలు అందడం లేదనేది జగమెరిగిన సత్యం.

సమగ్ర సర్వేతో పెరిగిన సమస్యలు

గత వైసిపి ప్రభుత్వం హయాంలో భూసమగ్ర సర్వే పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యల్ని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసినా ఫలితం మాత్రం కనిపించలేదు. సమగ్ర సర్వే ప్రక్రియను కింద స్థాయిలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వానికి కూడా చెడ్డపేరు తెచ్చిపెట్టింది. అప్పటి వరకు ఉన్న సమస్యలు మరింత పెరిగాయి. కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. సమగ్ర సర్వే పేరుతో కింద స్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచి తక్కువ వ్యవధిలో ఎక్కువ గ్రామాల రీసర్వే పూర్తి చేయాలనే లక్ష్యాలను నిర్ధేశించడంతో అప్పటి ప్రభుత్వం ఆశించిన ఫలితాలు రాలేదు. ప్రజల సమస్యలు కూడా రెట్టింపయ్యాయి. ఒకరి భూమి ఇంకొకరి పేరిట ఆన్ లైన్‌లో నమోదు కావడం, ఒత్తిడి కారణంగా సిబ్బంది ఆఫీస్ ల్లో కూర్చొని సర్వే చేసినట్లు తప్పుడు లెక్కలు చూపించడంతో భూ సమస్యలు పెరిగాయి.

సదస్సులతో సమస్యలు సమసిపోతాయా?

2014 నుంచి 2019 వరకు టిడిపి ప్రభుత్వం హయాంలోనూ రెవిన్యూ సదస్సులు నిర్వహించారు. భూసమస్యలపై అర్జీలు తీసుకోవడమే ధ్యేయంగా గతంలో సదస్సులు జరిగాయి. కానీ ఆ సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలు మాత్రం ఆశాజనకంగా లేవు. ప్రచార ఆర్భాటం కోసమే రెవిన్యూ సదస్సులు నిర్వహించారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటింది. గత ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పిదాలు సరిదిద్దడం, తలెత్తిన సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ఈనెల 6 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో గల 450 గ్రామపంచాయతీల్లోనూ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. ఈ సదస్సులకు అధికారులతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా హాజరవుతారు. అంటే వైసిపి ప్రభుత్వం హయాంలో జరిగిన సమగ్ర సర్వే లోపాల వల్లనే భూ సమస్యలు పెరిగాయనే విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వం ఈ రెవిన్యూ సదస్సుల నిర్వహణకు శ్రీకారం చుడుతున్నట్టు కనిపిస్తోంది. కేవలం ప్రచారార్భాటం కోసమే కాకుండా తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి శ్రద్ధ వహించాలి : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 6 నుంచి వచ్చే జనవరి 8 వరకూ నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. రెవెన్యూ సదస్సులపై జిల్లా, మండల అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో మంత్రి సమీక్షించారు. ఈ సదస్సుల సందర్భంగా సంబంధిత శాఖల అధికారుల బృందం ప్రతి రెవెన్యూ గ్రామాన్ని సందర్శించి ఫ్రీహోల్డ్, సెక్షన్ 22-ఎ కు సంబంధించిన భూ ఆక్రమణ సమస్యలతో ప్రభావితమైన వారి నుంచి ముందస్తు సమాచారంతో వినతులను స్వీకరించడం జరుగుతుందన్నారు. గ్రామ, మండల స్థాయిలో పిటిషన్ల స్వీకరణ, పరిష్కార విధానాన్ని కలెక్టర్, జెసి పర్యవేక్షించి సకాలంలో ఆయా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల సందర్భంగా స్వీకరించే ఫిర్యాదులన్నింటినీ రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ రూపొందించిన గ్రీవెన్స్ రిడ్రెసల్ పోర్టల్లోని ప్రత్యేక విండోలో ఆన్‌లైన్లో పొందుపర్చనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులకు జాయింట్ కలెక్టర్ సమన్వయకర్తగా ఉంటారని, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లను వారి డివిజన్, మండలాల్లో ప్రతి రెవిన్యూ గ్రామంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి శ్రద్ధ వహించాలన్నారు. భూ సమస్యలు వల్ల రైతులు రుణాలు కూడా పొందలేక పోతున్నారని చెప్పారు.

ధాన్యం కొనుగోలుపై రైతులు ఆనందం

ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలని మంత్రి అన్నారు. 24 గంటల్లో డబ్బులు జమ అవుతుందనితెలిపారు. ధాన్యం కొనుగోలుపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి, పక్కన ఎమ్మెల్యే, కలెక్టర్

7న మెగా తల్లిదండ్రుల దినోత్సవం

ఈనెల 7న మెగా తల్లిదండ్రుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు మంత్రి చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను గమనించాలని కోరాలని ఆమె పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అనర్థాలు, సెల్ ఫోన్లు వినియోగం తదితర అంశాలపై చర్చించాలన్నారు. మగ పిల్లలకు కూడా విలువలను గూర్చి తెలియజేయాలని ఆమె సూచించారు.

ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలపై దృష్టి సారించాలి, అవగాహన కల్పించాలని అన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ డి-పట్టా భూముల వ్యవహారంపైన, ఒకే భూమికి బహుళ రిజిస్ట్రేషన్లపై దష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాసిత కుటుంబాల సమస్యలు, గృహ పట్టాలపై సమస్యలు ఉన్నాయని వీటిపై దృష్టి సారించాలని సూచించారు. అందరు సమష్టిగా కృషి చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని అన్నారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, ఇనాం భూముల సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సదస్సులను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సదస్సుల్లో ఫిర్యాదుల స్వీకరణకు ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తామని, ఇతర సేవలందించేందుకు మరో కౌంటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మెగా తల్లిదండ్రుల దినోత్సవంలో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు, ఆరోగ్య కార్డులు అందిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికీ 32వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, ఎస్.యశ్వంత్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఎఫ్ఒ జిపిపి ప్రసూన, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

10,11న సిపిఎం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పార్వతీపురం

సిపిఎం 10వ జిల్లా మహాసభలు ఈనెల 10, 11 తేదీల్లో కురుపాంలో జరగనున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ గత మూడేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన రాజకీయ విధానాలను సమీక్షించుకొని దాని ఆధారంగా పార్టీ ఎత్తుగడలను, లోపాలను, నిర్మాణ అంశాలపై చర్చించి భవిష్యత్తు రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్దిష్టమైన ప్రణాళిక, కర్తవ్యాలను రూపొందించేందుకు ఈ మహాసభలు జరుపుతున్నామని అన్నారు. గత మహాసభ పార్వతీపురంలో జరగ్గా, ప్రస్తుతం కురుపాం కేంద్రంగా జరిగే 10వ జిల్లా మహాసభల జయప్రదం కొరకు రైతులు, ప్రజలు, కార్మికులు, మేధావులంతా హార్థిక, ఆర్థిక సహకారంతో జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, కమిటీ సభ్యులు పాకల సన్యాసిరావు, రెడ్డి శ్రీదేవి, బి.సూరిబాబు, ఎస్.ఉమా, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

కురుపాం : నియోజవర్గ కేంద్రమైన కురుపాంలో ఈనెల 10, 11 తేదీల్లో సిపిఎం 10వ జిల్లా మహాసభలు జరుగుతాయని, ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. తిరుపతిరావు , కె .గంగు నాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రావాడ జంక్షన్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. మన్యం ప్రాంతంలో అనేక ప్రజా సమస్యలు పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించి ప్రజల పక్షాన నిలబడింది సిపిఎం పార్టీనని, వాటిని సమీక్షించుకొని రాబోయే కాలంలో జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంతో పోరాటాలకు సమాయత్తమవుతుందని అన్నారు. పార్టీలు మారినా, నాయకులు వారేనని, కావున పాలకులపై ఆశలు పెట్టుకొని ప్రజలు పోరాడకపోతే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంటాయని, కావున ఉద్యమాలకు ప్రజలంతా కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస మండల సిపిఎంకార్యదర్శి కూరంగి సీతారాం పాల్గొన్నారు.

మక్కువ : ఈనెల 10, 11 తేదీల్లో కురుపాంలో జరగనున్న సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఇందిర పిలుపునిచ్చారు. మండలంలోని వెంకట బైరిపురంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలన్నారు. కార్మిక, రైతు సోదరులంతా తరలివచ్చి సభలను జయప్రదం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పలువురు సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా : డిఐజి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం


ఆంధ్రా- ఒడిస్సా సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి అన్నారు. గురువారం ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులు పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగా ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ ఏడాది ఎక్కువ శాతం ఆత్మహత్యలు, పాయిజన్ కేసులు నమోదయ్యాయన్నారు. ఇటీవల కాలంలో మిగతా ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాలు, గంజాయి రవాణా ఎక్కువగా కనిపిస్తుందన్నారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. అరకు, పాడేరు ప్రాంతాల్లో 30 గ్రామాల పరిధిలో పండిస్తున్న 40 ఎకరాల గంజాయి తోటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అనంతరం పోలీస్ చెక్ పోస్ట్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో నిరంతరం నిఘాపై దృష్టి సారించాలన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి : డిఐజి

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించిన నాడే భవిష్యత్తును చక్కదిద్దుకోగలరని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి అన్నారు. స్థానిక ఏకలవ్య పాఠశాలలో ఏర్పాటు చేసిన సంకల్పం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తాను అన్ని తరగతుల్లో క్రమశిక్షణతో చదువుకొని ఉండడం వల్లే ఈ స్థానంలో ఉండే మాట్లాడగలుగుతున్నానని అన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తికి యువత దూరంగా ఉండాలని సూచించారు. అవసరమైన పనుల కోసం సెల్ఫోన్ వినియోగం పరిమితం కావాలని అన్నారు. ఎక్కువ సమయం సెల్ఫోన్ వినియోగించడం వల్ల చెడు ప్రభావంపై మనసు ఉంటుందని ఇది మంచి పద్ధతి కాదన్నారు. గంజాయి, సారాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మారకూడదన్నారు. మంచి సమాజం కోసం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి, పాలకొండ డి.ఎస్.పి ఎల్విన్ పేట, చిన మేరంగి సిఐలు హరి, తిరుపతిరావు ఎల్విన్ పేట, నీలకంఠాపురం, కురుపాం ఎస్ఐలు బిడ్డిక శివప్రసాద్, నీలకంఠ రావు, నారాయణరావు, ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపల్ శ్రీ వీర్ సింగ్ , ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఎల్విన్‌పేట పోలీ స్టేషన్‌లో మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్ జెట్టి



డిఐజికి పూలమొక్క అందజేసి స్వాగతం పలుకుతున్న కురుపాం ఎస్ఐ నారాయణరావు

కురుపాం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఐజి

కురుపాం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను విశాఖ డిఐజి గోపీనాథ్ జెట్టి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను, పలు గదులను పరిశీలించారు. అనంతరం ఈ ప్రాంతంలో సైబర్ క్రైమ్ నేరాలు, గంజాయి, రోడ్డు ప్రమాదాలు , మత్తు పదార్థాలు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంకల్పం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో సైబర్ క్రైమ్, గంజాయి, మత్తు పదార్థాలు, రహదారి ప్రమాదాలపై ప్రజలకు ఎక్కువగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం నీలకంఠాపురం పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు.

పాలకొండ : గంజాయి సాగు, రవాణా సేవించడం తీవ్రమైన నేరమని విశాఖ రేంజ్ డిఐజి జెట్టి గోపీనాథ్ జెట్టి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా, సేవించినా తీవ్ర నేరమని ఇందుకు తీవ్రమైన శిక్షలు ఉన్నాయని హెచ్చరించారు. గంజాయి సాగు చేసి పట్టుబడితే 20ఏళ్ల జైలు శిక్ష పడేలా చట్టాలు ఉన్నాయని, కావున యువత, విద్యార్థులు కూడా గంజాయికి దూరంగా ఉందని సూచించారు. ఏమైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1972కి ఫిర్యాదు చేయాలన్నారు. డిఎస్‌పి రాంబాబు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రయోగమూర్తి ఉన్నారు.

సీతంపేట : స్థానిక పోలీస్ స్టేషన్లను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచనలు, సలహా ఇచ్చారు. నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీతంపేట, ధోనుబాయి ఎస్సైలు వై.అమ్మనరావు, షేక్ మస్తాన్ ఉన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 7న పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఎంపిడిఒలను ఆదేశించారు. గురువారం తనకార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజాప్రతినిధులు, మండల అధికారులను ఆహ్వానించాలని, అందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజలు చేతుల పరిశుభ్రత, బహిరంగ మలవిసర్జన రహిత సమాజం ఏర్పాటు చేయడం వంటి అంశాలను తెలియజేయాలన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో ప్లాస్టిక్ వాడరాదని సూచించారు. ప్రభుత్వం నుండి వచ్చిన పూర్తి సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలతో ఆరోగ్య కార్డులు సైతం అందించాల న్నారు. పాఠశాల ఆవరణలో మన బడి మన తోట, శాస్త్ర విజ్ఞాన ప్రయోగ శాలలు, మైదానం, తరగతి గదులు, వంట గదులు తదితర అంశాలను తల్లిదండ్రులకు చూపించా లని సూచించారు. రంగోలి, టగ్ ఆఫ్ వార్, వాలీ బాల్, టెన్నిక్వైట్ తదితర ఆటలు తల్లిదండ్రులకు నిర్వహించాల న్నారు. విద్యా ర్థులు కార్యక్రమ వ్యాఖ్యాతగా (యాంకర్) వ్యవహరించాలని ఆయన చెప్పారు. పాఠశాల ప్రగతి, విద్యా ప్రమాణాలు కోసమే చర్చ, ప్రసంగాలు ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో రక్త హీనతను కూడా చర్చించి పోషక ఆహారాల విలువలు వివరించి, స్థానికంగా లభ్యమవుతున్న కూరగాయలు వివరాలు కూడా అందించాలని ఆయన వివరించారు. మొత్తం కార్యక్రమాన్ని డాక్యుమెంట్ తయారుచేయాలని, ఉత్తమ పాఠశాలకు అవార్డు ప్రధానం చేస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

రాజకీయాలకు అతీతంగా శ్యామలాంబ పండగ : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

రాజకీయాలకు అతీతంగా ప్రతిష్టాత్మక శ్యామలాంబ పండుగ నిర్వహిస్తామని గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి చెప్పారు. పట్టణంలోని శ్యామలాంబ ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ అక్కేన అప్పారావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన కమిటీ ఎంపిక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉత్సవ కమిటీలను కూడా రాజకీయాలకు అతీతంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. పట్టణంలో పండుగ నిర్వహణ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో అదనంగా మరో రెండు ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాగునీటి కొరత లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. పండగ నిర్వహణకు చందాల వసూళ్లు అనేది సాంప్రదాయంగా వస్తుందని చెప్పారు. ఎవరి శక్తి మేరకు వారు చందాలు అందజేయవచ్చునని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ మాట్లాడుతూ పండుగ విజయవంతం కావడానికి పట్టణంలో వీధుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, విక్రం చంద్ర సన్యాసిరాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సిగడాపు బంగారయ్య పాల్గొన్నారు.


స్వయం ఉపాధికి అవకాశం కల్పించండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రాంతంలో ఉపాధి కల్పనకు అవకాశం తక్కువని, స్వయం ఉపాధి పనులు చేసుకుంటూ కుటుంబ జీవనం కొనసాగిస్తున్నారని వీరందరికీ ఉపాధి కల్పించాలని గురువారం తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం నాయకులు బంకురు సూరిబాబు, సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, శ్రామిక మహిళ జిల్లా నాయకులు వి.ఇందిర, కోలా రాజు, రాజాన రాజు, ఇసుకల రోహిణికుమార్, వాకబ్, కోలా సుధాకర్, పాలకొండ వెంకన్న ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌తో పాటు సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ అంకిత సురానను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము వ్యాపారం చేసుకునేందుకు ఉపాధిని కల్పించాలని, జిల్లా అభివృద్ధికి అందరూ సహకరిస్తామని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వ్యాపారం చేసుకొనేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వగా, డిఎస్పీ స్పందిస్తూ ప్రత్యక్షంగా చూసి సానుకూలంగా స్పందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పాకల సన్యాసిరావు, సంచాన ఉమా, తోపుడుబండ్లు, చిల్లర వర్తకులు పాలకొండ సుమన్, ఎన్.మహేంద్ర, ఎస్.చిరంజీవి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న సిపిఎం నాయకులు, తోపుడు బండ్లు, చిరువ్యాపారులు



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న ప్రముఖ కవి గౌరునాయుడు

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న నిరసన దీక్షలు 16వ రోజు కొనసాగింది. స్థానిక ఐటిడిఎ కార్యాలయం వద్ద జరుగుతున్న దీక్షలకు ప్రముఖ కవి, రచయిత గంటేడ గౌరు నాయుడు మాస్టర్ మద్దతు తెలిపారు. శిబిరం వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోరాటం న్యాయమైందన్నారు. విజయం సాధించే వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, రమేష్, కామేష్, మురళి, వెంకట్, తిరుపతి నాయుడు, జ్యోతి, లక్ష్మి, షర్మిల, నిర్మల, కవిత, గున్నమ్మ, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పర్యటన

సీతంపేట : రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం సీతంపేట ఐటిడిఎలో పర్యటించనున్నారని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు ఐటీడీఏ మీటింగ్ హాల్లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ముక్కిడి పోలమ్మ విడికెను సందర్శిస్తారు. కావున జిల్లా అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో హాజరుకావాలని పిఒ తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వికలాంగులకు అండగా ఉంటాం

గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-పార్వతీపురం

విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. గురువారం ఐటిడిఎ ప్రాంగణంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వికలాంగుల సంక్షేమం కోసం ప్రతీ నెలా ఇచ్చే మూడు వేల పెన్షన్ ను ఒకేసారి ఆరు వేల రూపాయలకు పెంచి, వారు ఎందులోనూ తక్కువ కాకూడదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పది వేలు, పూర్తిగా మంచానికి పరిమితమైన వికలాంగులకు పదిహేను వేల రూపాయలను పెన్షన్ గా ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి అన్నారు. చాలా మంది విభిన్న ప్రతిభావంతులు పభుత్వ ఉద్యోగాలు సాధించి అత్యున్నత స్థితికి చేరుకున్నారని, అలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మీరు కూడా ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. త్వరలోనే జిల్లాలో వికలాంగుల కోసం మెడికల్ క్యాంపు పెడతామని తెలిపారు. ఎవరికైనా మూడు చక్రాల వాహనం, చెక్క కాలు, చేతి కర్రలు ఎవరికీ కావాలన్నా దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ వికలాంగుఉల ఏ పని మొదలుపెట్టినా సాధించి తీరుతారని అన్నారు. చదువులో అయిదు శాతం రిజర్వేషన్ విభిన్న ప్రతిభావంతులకు కేటాయించారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించామని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ పారా ఒలంపిక్స్ క్రీడా పోటీల్లో సుమారు 54 మంది దివ్యాంగులు పాల్గొని 7 బంగారు పతకాలు, 4 సిల్వర్, 8 కాంస్యం బహుమతులు గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం క్రీడా పోటీలలో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కె. కవిత, వివిధ మండలాల నుండి వచ్చిన వికలాంగులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న వికలాంగులు

రూ.కోటితో సిహెచ్ఆర్ఆర్ రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కొమరాడ

చిలకపాలెం-రామభద్రపురం- రాయగడ (సిహెచ్ఆర్ఆర్) రోడ్డు అత్యవసర మరమ్మతు పనులు పురోగతిలో ఉన్నట్లు ఆర్ అండ్ బి సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.రాజేంద్ర కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజాశక్తి'లో ఇటీవల ప్రచురితమైన అంతర్ రాష్ట్ర రోడ్డు పనుల్లో డొల్ల శీర్షికకు ఆయన స్పందిస్తూ రూ.100లక్షలతో సిహెచ్ఆర్ఆర్ పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. కూనేరు వద్ద రహదారి చాలా భాగం స్థానిక ప్రజలచే ఆక్రమించబడినందున, డ్రెయిన్లు అందించే అవకాశం లేదని అన్నారు. ఈ విషయమై కొమరాడ మండలంలోని అన్ని గ్రామాల్లో సిహెచ్ఆర్ఆర్ రహదారి వెంబడి ఎఫ్ఎంబి వివరాలను అందించాలని, గ్రామ పరిధిలోని ఆక్రమణలను తొలగించి సరైన డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్‌కు లేఖ పంపినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం ఈ కార్యాలయానికి ముందస్తు సమాచారం లేకుండా రోడ్డు క్యారేజ్ మార్గానికి చాలా దగ్గరగా నీటి పైపు లైన్‌ను ఏర్పాటు చేయడంతో పైపులు లీకేజీ అవుతూ రోడ్డుపైకి వస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో వివరించారు.



డిఇఓకు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అసంబద్ధ నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్ర విద్యాశాఖ అసంబద్ధ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ రావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు గురువారం డిఇఓ ఎన్.తిరుపతినాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు పని వేళ పెంపు, ఉపాధ్యాయుల సెలవుపై ఆంక్షలు, వందరోజుల కార్యాచరణ ప్రణాళిక, అపార్ నమోదులో జాప్యంపై ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం వంటి నిర్ణయాలతో ఉపాధ్యాయులు ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈనెల 11న జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన, 16న రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహరించుకోకపోతే ఆందోళనకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు.

పారా లీగల్ వాలంటీర్ల ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

మండల న్యాయ సేవా అధికార సంస్థలో సేవలందించేందుకు పారా లీగల్ వాలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు సంస్థ చైర్మన్, రెండో జిల్లా అదనపు జడ్జి ఎస్.దామోదరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లకు పదో తరగతి ఉత్తీర్ణులైన, తెలుగు చదవడం, రాయడం రావాలన్నారు. అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉండకూడదన్నారు. ఎటువంటి జీత భత్యాలు ఉండవని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పూర్తి పేరు, చిరునామా, చరవాణి నెంబర్, విద్యార్హతలు, వృత్తి శిక్షణ పూర్తయిన తర్వాత ఏ ప్రాంతంలో సేవలు అందిస్తారో వివరాలు ఈనెల 18లోగా చైర్మన్, మండల న్యాయ సేవా అధికార సంస్థ, పార్వతీపురం చిరునామాకు దరఖాస్తులు పంపించాలని పేర్కొన్నారు. కోర్టులో ఈనెల 21న మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

చేపల పెంపకంతో జీవనోపాధి

ప్రజాశక్తి - భామిని

ఐటిడిఎ ద్వారా ఉచితంగా అందించిన చేప పిల్లలు చెరువుల్లో పెంపకం ద్వారా మెరుగైన జీవనోపాధి పొందవచ్చని మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ అన్నారు. మండలంలోని బొద్దగూడ, తాటి మణుగూడ, మణిమ పంచాయతీల్లోని 27 చెరువుల్లో 41,200 చేప పిల్లలను గురువారం పెంపకానికి విడిచి పెట్టారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు సంజీవ్, సింహాచలం,లోకేష్ ఉన్నారు.



లేఅవుట్ సర్వేను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి కామేశ్వరరావు

లేఅవుట్లను పరిశీలించిన విజిలెన్స్ అధికారి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో మంజూరైన హౌసింగ్ లేఅవుట్లను గురువారం హౌసింగ్ విజిలెన్స్ అధికారి అట్టాడ కామేశ్వరరావు పరిశీలించారు. పట్టణానికి చెందిన నెలిపర్తి లేఅవుట్ -1ను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత లేఅవుట్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో మంజూరైన ఇళ్లు, పూర్తయిన ఇళ్లకు సంబంధించిన వివరాలను హౌసింగ్ అర్బన్ ఎఇ టి.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో రోడ్లు, కాలువలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలకు సంబంధించిన పనుల గురించి మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ వున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - సీతానగరం

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తతో ఉండాలని ఎఎస్ఐ లంక శ్రీనివాసరావు అన్నారు. సంకల్పంలో భాగంగా మండలంలోని లక్ష్మీపురం, గుచ్చుమిలో సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికులతో మాట్లాడుతూ మీకు తెలియని వ్యక్తుల నుంచి లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆన్లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైం, ఆన్లైన్ మోసాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో జయలక్ష్మి, సుజాత, పద్మ సంపత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మక్కువలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంచాయతీ ఇఒ కె.సురేష్ పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఎస్సీ వీధి, చెముడుకు వెళ్లే ప్రధాన రహదారి పరిసరాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను జెసిబి సహాయంతో గురువారం తొలగించారు. పారిశుధ్య పనులు జరుగుతున్న తీరును ఇఒపిఆర్‌డి దేవకుమార్ పరిశీలించారు

సూర్యనారాయణ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన మాజీ సర్పంచ్ గొర్జి సూర్యనారాయణ భార్య గొర్జి సరోజనమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, స్థానిక నాయకులతో పాటు కలిసి సూర్యనారాయణ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమైన విషయమని విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళ్లు అర్పించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - పాచిపెంట

గర్భిణీలు సంపూర్ణ పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు సుఖ ప్రసవమయ్యే అవకాశాలు ఉన్నాయని సిడిపిఒ బి.అనంతలక్ష్మి అన్నారు. సాలూరులోని వైటిసిలో గల గర్భిణుల వసతి గృహాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పాచిపెంట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల ఐదు గురు గర్భిణీలను కలిసి అక్కడ వారికి అందుతున్న వసతి పౌష్టికాహారం, మందులు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి 25గుడ్లు, ఐదు లీటర్ల పాల ప్యాకెట్లు, బాల సంజీవని కిట్లు, గోధుమపిండి, రాగి పిండి, ఎండు ఖర్జూరం, బెల్లం, వేరుశెనక చక్కీలు అందజేశారు. అలాగే రోజు తీసుకోవాల్సిన ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రెడ్డి ఇందిర ఉన్నారు.



గర్భిణిలకు గుడ్లు అందజేస్తున్న ఐసిడిఎస్ అధికారులు



తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, సిపిఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థుల చదువులను కాపాడాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల చదువులను కాపాడాలని గిరిజన సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, కె.సీతారాం, వాసు కోరారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాల సిఆర్‌టి ఉపాధ్యాయులు నేటికీ 15 రోజులుగా ధర్నా చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. దీంతో గిరిజన విద్యార్థుల చదువులు మసకబారిపోతున్నాయని కావున తక్షణమే ప్రభుత్వ స్పందించి అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ చేసి గిరిజన విద్యార్థులకు విద్యను అందించేలా చూడాలని నాయకులు కోరారు. అనంతరం తహశీల్దార్ ఎం.రమణమ్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి

ప్రజాశక్తి-గరుగుబిల్లి

ఉపాధి హామీలో ప్రజలకు అవసరమైన పనులు చేపట్టాలని ఎంపిపి ఉరిటి రామారావు అన్నారు. గురువారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమా వేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన మిషన్ ద్వారా చేపట్టిన పనులు వలన ఇంటింటి కుళాయి నీరు సక్రమంగా అందడం లేదని, కొన్ని గ్రామాల్లో కొన్ని వీధులకు పూర్తిగా కనెక్షన్‌లు ఇవ్వలేదని అన్నారు. ఉపాధిహామీ పథకంలో ప్రజలకు అవసరమైన పనులు గుర్తించి చేపట్టాలని, గడిచిన కొద్ది సంవ త్సరాల నుంచి చేసిన పనులే ప్రతి సంవత్సరం చేస్తుండడంతో ఎవరికీ ఉపయోగకరంగా లేవని పేర్కొ న్నారు. గ్రామానికి, రైతులకు అవసరమైన పనులు గుర్తించి చేయాలని నాగూరు ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్య నారాయణ (సత్తిబాబు) అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఉపాధి ఎపిఒ మండల గౌరీ నాథ్ సమాధానం ఇస్తూ సభ్యులు తెలియజేసిన మేరకు గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి మాట్లాడుతూ మండల పరిధిలోని 13 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రావుపల్లి గ్రామంలోని ఎస్ సి కాలనీలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎంపిటిసి సభ్యులు యందవ సదానందం అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ గోపి గౌరీ శంకర్రావు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారా నిమిత్తం నిధులు మంజూరయ్యా యని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రావివలసలో నిర్మాణం చేపట్టిన రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును తక్షణమే ప్రారంభించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపిటిసి సభ్యులు కోట భరత్ కుమార్ (సుమన్) అధికా రులు దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రేషన్ సరుకుల వివరాలను గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని నాగూరు ఎంపి టిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్తి బాబు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. నూతన గృహ కోసం ఆన్‌లైన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు బి.లక్ష్మి, ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎంపిటిసి సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, బొంగు గౌరమ్మ, సర్పంచులు అంబటి తవిటినాయుడు, కలిశెట్టి ఇందుమతి, రౌతు గోవిందనాయుడు, కరణం రవీంద్ర, విద్యుత్ శాఖ జెఇ బొంతాడ శంకర్రావు, గృహ నిర్మాణ శాఖ ఎఇ వంగపండు అఖిల్ నాయుడు, తదితరులు పాల్గొన్నా రు.

సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు అందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమం జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పతాక నిధి ఫ్లాగ్ ప్రారంభించి, జిల్లాలోని సైనికులకు, మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు సాయుధ దళాల పతాక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తొలి చందాను పతాక నిధికి అందజేసి, ప్రతి ఒక్కరిలో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాల పట్ల యావత్ దేశం గర్విస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎంతో మంది సైనిక సోదరులు దేశ రక్షణ కోసం తమ ప్రాణాలు సైతం అర్పించి ప్రాణత్యాగం చేసిన సంగతిని గుర్తు చేశారు. ప్రాణత్యాగం చేసిన వీర సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు పతాక నిధికి విరివిగా విరాళాలు అందిం చాలని జిల్లాలోని పౌరులు, వ్యాపార వేత్తలు, పారిశ్రామికవేత్తలను కలెక్టరు కోరారు. మీరు అందించే విరాళాలను ఎస్బిఐ అకౌంట్ నెం. 52065221666, IFSC Code: SBIN0020931, MICR No .5350020172 డైరెక్టర్, సైనిక వెల్ఫేర్, విజయవాడ పేరున చెక్కు / డ్రాఫ్ట్ తీసి జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, విజయనగరానికి పంపాలని కోరారు. అలాగే ఈనెల 7న ఎన్‌సిసి విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వచ్చి విరాళాలు స్వీకరిస్తారని అన్నారు. జిల్లాలో పతాక నిధి విరాళాలను విరివిగా అందించి మాజీ సైనికుల సంక్షేమమునకు తోడ్పడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పతాక నిధికి అందించే విరాళాలకు ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందని వివరించారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి మన్మధరావు

పశుగణన వేగవంతం

ప్రజాశక్తి - సీతానగరం

భారత పశుగణన సర్వేను వేగవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.మన్మధరావు అన్నారు. స్థానిక పశు సమర్ధక శాఖ కార్యాలయం వద్ద సీతానగరం, బలిజిపేట పశు వైద్య సహాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ మండలంలో 14,500 పశువుల హౌసెస్ ఉన్నాయని, ఇప్పటివరకు 3859 సర్వే జరిగాయని, ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్రూసెల్లస్ టీకాలను 550 పశువులకు వేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టం ద్వారా మంజూరైన గోశాలల పనులను వేగవంతం చేయాలన్నారు. మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు మాట్లాడుతూ మొదట విడతగా 23 గోశాలలు మంజూరయ్యాయని, ఇవి నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. మరో 28కి ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు. అలాగే ఉపాధి హామీ చట్టం ద్వారా పశుగ్రాస కోసం రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి డాక్టర్ కె ప్రసాదరావు, పశుసంవర్ధక శాఖ ఎడి సిహెచ్ దీనకుమార్, బలిజిపేట పశు వైద్యాధికారి జి.గణేష్, గ్రామపశు సహాయకులు పాల్గొన్నారు.

సాగుదారులను బెదిరించడం సరికాదు

ప్రజాశక్తి - కొమరాడ

తాత, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూమికి అన్ని హక్కులు ఉన్నప్పటికీ కొంతమంది వ్యక్తులు హైకోర్టు నుండి ఆర్డర్ తెచ్చి బెదిరించడం చాలా అన్యాయమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్‌కు బాధిత రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన, దుగ్గి గ్రామ సర్పంచి పిట్ట వెంకటి మాట్లాడుతూ తమ గ్రామంలో తాత ముత్తాతల నుంచి 70 ఏళ్ల నుంచి 22 మంది రైతులు 23 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన పిట్ట జమ్మయ్య, వెంకయ్య ఎన్నో ఏళ్లుగా ఊర్లో లేనప్పటికీ వాళ్ల పేరున భూమి ఉందని పార్వతీపురం పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు హైకోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకొని ఈ భూములు తమవి అంటూ బెదిరించడం చాలా దారుణమన్నారు. పార్వతీపురం పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ముటేషన్ పెట్టుతున్నారని అయితే ఈ ముటేషన్ నిలిపివేసి తమ గ్రామానికి వచ్చి పూర్తిస్థాయిలో ఈ 23 ఎకరాల భూమిపై దర్యాప్తు చేపట్టి వాస్తవాలు తెలుసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో బాధితులు ఉన్నారు.

ప్రకృతి సాగు పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని ధోనుభాయిలో, బిడ్డిక గిల్లయ్య రైతు ఎటిఎం మోడల్ నమూనాను, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.షణ్ముఖరాజు పరిశీలించి సలహాలు, సూచనలు అందించారు. అలాగే బూర్జిగూడలో సమీకృత వ్యవసాయం చేస్తున్న జీలకర్ర మధుసూదన్ ఎటిఎం మోడల్‌ను పరిశీలించి, స్టేట్ వీడియో రిసోర్స్ పర్సన్ వినయ్ వీడియో చిత్రీకరించారు. అనంతరం దిబ్బ గూడలో బంట్రోతు శ్రీను ఎటిఎం నమోనాను పరిశీలించి అలాగే అదే రైతు, అరటిలో అంతర పంట పెసర, మినుములు, ఆకు, తోటకూరగాయల పంటలను కూడా చూసి, ఆ రైతు విజయ గాధను వీడియో చిత్రీకరించారు. అదే రైతు 25 సెంట్ల విస్తీర్ణంలో వేసుకొన్న మారిసస్ క్యూ పైనాపిల్ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ ముసలయ్య, డివిజన్ ఇన్‌ఛార్జులు బాలు, అంబోజీ, మండల ఇన్‌ఛార్జి సత్యనారాయణ, యూనిట్ ఇన్‌ఛార్జిలు నరేష్, రమేష్, కేశవ, సిఆర్పిలు పాల్గొన్నారు.

పేరెంట్, టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

ఈనెల 7న జరగనున్న మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విజయవంతం చేయాలని మన్యం జిల్లా సమగ్ర శిక్షా అకడమిక్ మోనిటరింగ్ అధికారి శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శించారు. మెగా పేరెంట్స్ మీటింగ్ ఏర్పాట్లు పరిశీలించి అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఎంఇఒలు ఎన్.సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి, హెచ్ఎం టి.శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ఈనెల 7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ సక్రమంగా నిర్వహించడానికి స్థానిక జడ్పీహెచ్ స్కూల్‌లో సమగ్ర శిక్ష అధికారులు సందర్శించి తగు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రణాళికాబద్ధంగా సమావేశం జరగాలని సూచించారు. ఎఎంఒ శ్రీనివాసరావు, అధికారులు ఉన్నారు.

గర్భిణుల ఆరోగ్య సమాచారానికి కిల్కారీ సేవలు

ప్రజాశక్తి - పార్వతీపురం

గర్భిణీ, శిశు ఆరోగ్య శ్రేయస్సుకు కిల్కారీ సేవలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, మొబైల్ ద్వారా అవసరమైన ఆరోగ్య సమాచారం వారికి అందజేయడం జరుగుతుందని స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ పి.రమేష్ తెలిపారు. కిల్కారీ సేవలపై శిక్షణను స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. డిఐఒ డాక్టర్ ఎం. నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కెవిఎస్ పద్మావతి ఆధ్వర్యంలో ఆశా నోడల్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో కిల్కారీ సేవలు వినియోగం, ఆవశ్యకతపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రసవం పూర్తయ్యే వరకు, బిడ్డ ఏడాది వయస్సు వరకు గర్భిణీ నమోదు సమయంలో ఇచ్చిన ఫోన్ నంబర్‌కు వారి ఆరోగ్యానికి అవసరమైన సమాచారం 01244451660 కిల్కారీ నంబర్ ద్వారా వస్తుందని, ఒక వేళ ఆ సమయంలో ఫోన్‌కు అందుబాటులో లేకపోతే గర్భిణులు కిల్కారీ సేవలు తిరిగి వినాలంటే 14423 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కిల్కారీ సేవలపై ఆశా ద్వారా గర్భిణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలు ప్రదర్శించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిల్లో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయాలన్నారు. మారుమూల గ్రామాల గర్భిణీ, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అక్కడ గర్భిణీలను ముందుగానే వసతి గృహాల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ రఘుకుమార్, నోడల్ అధికారి డాక్టర్ వినోద్, డిపిహెచ్ఎన్ఒ ఉషారాణి, డిపిఒ లీలారాణి, డిసిఎం విజయలత, సూపర్వైజర్ జయగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం

ప్రజాశక్తి - పాచిపెంట

నేలను పరిరక్షించుకోవడమనే ఐక్యరాజ్యసమితి నినాదంతో ప్రపంచ నేల దినోత్సవం గురువారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలి, మాతమూరులో ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ నేల నుండే ఆహారం తయారవుతుందని, నేలను పరిరక్షించుకుంటే ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని అన్నారు. ఇనుములోపం ఉన్న నేలలో పంటలను తినడం వల్ల ఎనీమియా, రక్తహీనత కలుగుతుందని, మట్టి పరీక్ష ఫలితాలను బట్టి భారతదేశ హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ నిరూపించారని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నేలల సంరక్షణ - పై విద్యార్థులకు క్విజ్ పోటీలు జడ్పీ హైస్కూల్ కొత్తవలస ప్రత్యేక అధికారిగా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో విఎఎ శ్రీను, దినేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో కుసిమిలో వరల్డ్ సోయిల్ డే వ్యవసాయ శాఖ ఎడి రత్నకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షలు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఎరువుల ఆవశ్యకత బట్టి పరీక్షలు ఫలితాలు వాటి గురించి వివరించారు. శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నేల ఆరోగ్యం కాపాడ్డానికి పచ్చిరొట్ట ఎరువులు, వేపపిండి వాడకం వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

భామిని: వ్యవసాయంలో రసాయనాలు వినియోగం తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తూ, భవిష్యత్తు తరాలు వారికి పోషకాలతో కూడిన నేలను అందించాలని వ్యవసాయశాఖ ఎడి మధుసుధాన రావు అన్నారు. భామిని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో ప్రపంచ నేల దినోత్సవం నిర్వహించారు. వ్యవసాయ శాఖలో ఉద్యోగులుగా ఉండడం చాలా అదృష్టమని, దేశానికీ అవసరమైన పంటలు పండించే రైతుకు మనం అండగా వుంటున్నామని, రైతులకు పంటలపై, నేల స్వభావం సంరక్షణపై అవగాహన కలిగించే బాధ్యత ప్రతి వ్యవసాయశాఖ సిబ్బందిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ఆస్పిరేషనల్ బ్లాక్ కో-ఆర్డినేటర్ మహేష్, విఎఎపాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బెంగుళూరులో పాలకొండ వాసి మృతి

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పప్పల ప్రవీణ్ (19) బెంగుళూరులో రైలు ఢీకొని గురువారం మృతి చెందారు. ఐటిఐ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో భాగంగా బెంగళూరు వెళ్లాడు. అక్కడ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన తండ్రి పప్పల సింహాచలం పాలకొండలో ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక కోటినగర్ లే అవుట్‌లో నిర్వహిస్తున్న అక్షర పబ్లిక్ స్కూల్‌పై సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన వ్యక్తికి హైపర్ విద్యుత్ వైర్లు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు పనితీరు పరిశీలించేందుకు టెక్నీషియన్ పాలక మురళిధర్ (38) పాఠశాల భవనం పై భాగానికి కెక్కారు. పై నుంచి వెళ్తున్న హైపవర్ విద్యుత్ వైర్లు మురళీధర్ మెడపై తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రధానంగా మెడ, మర్మవయువాలు, కాళ్లు కాలిపోయాయి. స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స చేయగా, మెరుగైన వైద్య సేవలు కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి పార్వతీపురం లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద బుధవారం అర్ధరాత్రి అమూల్ వ్యాను బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎటువంటి జరగకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి పార్వతీపురం మీదుగా శ్రీకాకుళం వెళ్తున్న అమూల్ ఐస్ క్రీమ్ వ్యాను సబ్ స్టేషన్ దగ్గరికి వచ్చేసరికి రెండు కుక్కలు అడ్డు పడగా వాటిని తప్పించేందుకు ప్రయత్నిస్తుండగా రోడ్డుపక్కన రెండు గొయ్యిలు ఉన్నాయి. వీటిని గమనించకపోవడంతో ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీ కొట్టి బోల్తా పడింది. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ స్తంభం ఢీకొట్టి బోల్తా పడినప్పటికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై జి.కళాధర్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.